



అల్లు అర్జున్

# రెండు భాగాలుగా

త్రివిక్రమ్, అల్లు అర్జున్.. ఈ కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలన్నీ హిట్సే. ఆల్రెడీ ఇది హ్యాట్రిక్ కాంబినేషన్. వీరిద్దరి నాలుగో సినిమాకు కూడా రంగం సిద్ధమైన విషయం తెలిసిందే. నాగవంశీ నిర్మించనున్న ఈ సినిమాను రెండు భాగాలు తెరకెక్కించాలని దర్శకుడు త్రివిక్రమ్ భావిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. కథ డిమాండ్ చేస్తున్న దృష్ట్యా ఈ సినిమాను రెండు భాగాలుగా తీయడం కరెక్టని త్రివిక్రమ్ నిర్మాతతో చెప్పారట. నాగవంశీ కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. 2025లో విడుదలయ్యే ఈ సినిమా, దర్శకుడిగా త్రివిక్రమ్‌కు తొలి పాన్ ఇండియా సినిమా అని చెప్పొచ్చు. ప్రస్తుతం బన్నీ 'పుష్ప-2'తో బిజీగా ఉన్నాడు. వచ్చే ఏడాది ఆగస్ట్ 15న 'పుష్ప-2' విడుదల కానుంది. ఆ సినిమా తర్వాత ఈ క్రేజీ యస్ట్ మూవీ సెట్స్‌పైకి వెళ్లనుంది.






రఘుబాబు, మాదాల రవి, సి.కల్యాణ్, సూర్యదేవర రాధాకృష్ణ, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, దిల్‌రాజు, సాయికిరణ్ యాదవ్ తదితరులు

# సినిమా పరిశ్రమకు ఏ కష్టమొచ్చినా ముందుంటా: మంత్రి తలసాని

'మన ప్రియతమ ముఖ్యమంత్రి కేసీఆర్‌గారు సినిమా పరిశ్రమ సమస్యల పరిష్కారం పట్ల ఎప్పుడూ సానుకూలంగా ఉంటారు. ఆయన ఆశీర్వాదమే మనకు శ్రీరామరక్ష. సినిమా పరిశ్రమకు ఏ కష్టమొచ్చినా ముందుంటాను' అని తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆయన జన్మదిన వేడుకలు తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ 'నా పుట్టినరోజును ఇంత ఘనంగా నిర్వహించిన తెలుగు సినిమా పరిశ్రమకు కృతజ్ఞతలు. నన్ను దీవించడానికి వేలాదిగా అభిమానులు రావడం ఆనందంగా ఉంది. ఇంతమంది అభిమానాన్ని చూరగొనడం నా పూర్వజన్మసుకృతం. ఈ చక్కని ఆత్మీయ వాతావరణం ఎప్పటికీ ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను' అన్నారు. తదనంతరం తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుమారుడు తలసాని సాయి కిరణ్ యాదవ్ తన తండ్రిపై రాయించిన ఓ ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. హైదరాబాద్ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన ఈ వేడుకల్లో చలనచిత్ర వాణిజ్యమండలి అధ్యక్షులు దిల్‌రాజు, ప్రముఖ నిర్మాతలు దామోదర ప్రసాద్, సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, సి.కల్యాణ్, నటులు రఘుబాబు, మాదాల రవి, చిత్రపురి కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ అనిల్ దొర్రై, సినీ జర్నలిస్ట్ సంఘం తరపున సురేశ్ కొండేటి, లక్ష్మీనారాయణ, 24 క్రాఫ్ట్స్‌కు సినీ కార్మికులు వేలాదిగా పాల్గొని తలసానిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# అవన్నీ అబద్ధాలే..!

అనుపమ పరమేశ్వరన్.. కేవలం ఆమె అందం కోసమే థియేటర్‌కెళ్లే అభిమానులు కోకొల్లలు. తెరపైకంటే అనుపమ ఇన్‌స్టాలో పెద్ద స్టార్. ఆమె ఫాలోవర్స్ సంఖ్య దాదాపు 14 మిలియన్ల పైమాటే. అది ఆమె క్రేజ్. అనుపమలో బహుముఖప్రజ్ఞ దాగుంది. బాగా పాడుతుంది. బాగా బొమ్మలేస్తుంది. బాగా నటిస్తుంది.. అందుకే ఈ మలయాళ మందారానికి అంత క్రేజ్. దానికి తగ్గట్టే రూమర్లు కూడా బాగానే వినిపిస్తుంటాయి. ఇటీవల ఓ రూమర్ అనుపమనే కాదు, ఆమె కుటుంబసభ్యుల్ని సైతం ఇరిటేట్ చేసింది. అదేంటంటే.. 'ఓ టాలీవుడ్ స్టార్‌హీరోను అనుపమ పెళ్లాడబోతున్నది. త్వరలోనే నిశ్చితార్థం జరుగనున్నది' ఇదీ ఆ రూమర్. దీనిపై అనుపమ తల్లి స్పందించారు. 'ఇవన్నీ పిచ్చి మాటలు. తనకు చాలా కెరీర్ ఉంది. ఎన్నో ఆశలు కూడా ఉన్నాయి. ఆమెపై మాకూ ఎన్నో ఆకాంక్షలున్నాయి. అప్పుడే పెళ్లేంటి? తను సాధించాల్సింది చాలా ఉంది. ఇలాంటి మాటలు నమ్మకండి. అనుపమ కెరీర్ ఇప్పుడే మొదలైందని మేం భావిస్తున్నాం' అని చెప్పారు అనుపమ పరమేశ్వరన్ తల్లి సునీత పరమేశ్వరన్. ప్రస్తుతం 'టిల్లూ స్క్వేర్'లో నటిస్తున్నది ఈ అందాలభామ.



కియారా ఖన్నా



# వాలిపో ఈ గుండెపైనే..

నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'హాయ్ నాన్న'. శౌర్యువ్ దర్శకుడు. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తున్నది. డిసెంబర్ 21న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌ను వేగవంతం చేశారు. ఈ సినిమాలో 'గాజు బొమ్మ' అనే రెండో గీతాన్ని శుక్రవారం అగ్ర హీరో మహేష్‌బాబు విడుదల చేశారు. 'నన్ను కదిలించినట్లే ప్రతీ తండ్రిని హత్తుకునే పాట ఇది. 'హాయ్ నాన్న' టీమ్‌కు నా శుభాకాంక్షలు' అని మహేష్‌బాబు పేర్కొన్నారు. 'ఇటు రావే నా గాజు బొమ్మ..నేనే నాన్న అమ్మ.. యద నీకు ఉయ్యాల కొమ్మ..నిను ఊపే చెయ్యే ప్రేమ..వాలిపో ఈ గుండెపైనే..ఆడుకో ఈ గూటిలోనే..' అంటూ తండ్రీకూతుళ్ల అనుబంధాన్ని హృద్యంగా ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన ఈ గీతానికి అనంత్‌శ్రీరామ్ సాహిత్యాన్ని అందించారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, దర్శకత్వం: శౌర్యువ్.



రోషన్, మానసా చౌదరి

# రోషన్ కనకాల 'బబుల్‌గమ్'

తెలుగుచలనచిత్ర పరిశ్రమలో పరిచయం అక్కర్లేని జంట రాజీవ్ కనకాల, సుమ కనకాల. రాజీవ్ నటుడిగా ప్రస్థానాన్ని సాగిస్తుంటే. సుమ తిరుగులేని వ్యాఖ్యాతగా సత్తా చాటుతున్నారు. త్వరలో వీరిద్దరి కుమారుడు రోషన్ కనకాల హీరోగా పరిచయం కానున్నాడు. సినిమా పేరు 'బబుల్‌గమ్'. మానసా చౌదరి కథానాయిక. క్షణం, కృష్ణ అండ్ హిజ్ లీల చిత్రాల దర్శకుడు రవికాంత్ పేరెపు దర్శకుడు. మహేశ్వరి మూవీస్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ' ముందు రోషన్‌కి నా అభినందనలు. నటుడిగా తను మంచి స్థాయికి వెళ్లాలి. పరిశ్రమలో తనకంటూ ఓ స్థానాన్ని ఏర్పరచుకోవాలి. తన తల్లిదండ్రులు రాజీవ్, సుమ గర్వపడేలా ఎదగాలి' అంటూ శుభాకాంక్షలు అందించారు. ఇదొక రొమాంటిక్ లవ్‌స్టోరీ అని, అక్టోబర్ 10న ఈ సినిమాకు సంబంధించిన స్టోరీ గ్లింప్స్‌ని విడుదల చేస్తున్నామని మేకర్స్ తెలియజేశారు. ఈ చిత్రానికి కెమెరా: సురేశ్ రగుతు, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

# ఉత్కంఠకు గురిచేసే యాక్షన్

'ఒక సీరియల్ కిల్లర్ నడిరోడ్డుమీద జనాన్ని గుడ్డిగా షూట్ చేస్తున్నాడు. ఆల్రెడీ రోడ్‌మీద చాలామంది చనిపోయారు. అతన్నెవరూ ప్రతిఘటించలేని పరిస్థితి. ఇంతలో ఓ పోలీస్ ఆఫీసర్ ధైర్యంగా ముందుకొచ్చి ఆ కిల్లర్‌ని కాల్చాడు. మళ్లీ అతను గన్‌ని రీలోడ్ చేసుకునే లోపు, ఆ కిల్లర్ పోలీస్ ఆఫీసర్‌ని కాల్చాడు. ఇప్పుడు ఆ పోలీస్ ఆఫీసర్ గన్ నీ చేతిలో వుంది. అండ్ యు హ్యావ్ ఏ క్లీన్ షాట్.. ఏం చేస్తారు?' ఏంటి?'' ఏ సినిమాలోని సన్నివేశం ఇది అనుకుంటున్నారా? తమిళ అగ్ర నటుడు విజయ్ హీరోగా నటిస్తున్న 'లియో' చిత్రం ట్రైలర్‌ని శుక్రవారం విడుదల చేశారు. ఈ ట్రైలర్‌లో విజయ్ వాయిస్ ఓవర్ ఇది. ఆద్యంతం ఉత్కంఠకు గురిచేసే యాక్షన్ ఎపిసోడ్స్‌తో ఈ ట్రైలర్ సాగింది. సినిమా అంతకు మించిన స్థాయిలో ఉంటుందని, విజయ్, అర్జున్, సంజయ్‌దత్ పాత్రలు డెడ్లీగా ఉంటాయని, త్రిష పాత్ర హైలైట్‌గా నిలిచే ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్‌కి కొదవుండదని మేకర్స్ చెబుతున్నారు. లోకేష్ కనకరాజ్ దర్శకత్వం, అనిరుధ్ సంగీతం, మనోజ్ పరమహంస సినిమాటోగ్రఫీ త్వరలో బాక్సాఫీస్ దగ్గర మళ్లీ మ్యాజిక్ చేయనున్నాయి. అక్టోబర్ 19న లియో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రియాఆనంద్, మిస్కిన్, మన్సూర్ ఆలీఖాన్, మథ్యూథామస్ తదితరులు ఈ చిత్రంలో నటించారు.



'లియో' చిత్రంలో విజయ్

# అంచనాలు నిజమయ్యాయి

'అందరూ కొత్తవాళ్లు కలిసి చేసిన ప్రయత్నమిది. తప్పకుండా ప్రేక్షకులు ఇష్టపడతారనే నమ్మకంతో ప్రమోట్ చేశాం. భారీ ఓపెనింగ్స్ వస్తున్నాయి. దాంతో ఈ తరహా సినిమాలు చేయడానికి మరింత ధైర్యం వచ్చింది' అన్నారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ. నార్నే నితిన్, రామ్ నితిన్, గౌరీ ప్రియారెడ్డి, అనంతిక సునీల్‌కుమార్, గోపిక ఉద్యాన్ ప్రధాన పాత్రల్లో నటించిన 'మ్యాడ్' చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. కల్యాణ్ శంకర్ దర్శకుడిగా పరిచయమైన ఈ చిత్రాన్ని హారిక సూర్యదేవర నిర్మించారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సక్సెస్‌మీట్‌లో నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ 'చిత్రానికి పాజిటివ్ టాక్ రావడంతో రాబోవు రోజుల్లో మరిన్ని కలెక్షన్స్ పెరుగుతాయని భావిస్తున్నాం. అన్ని కేంద్రాల్లో అద్భుతమైన ఆదరణ దక్కుతున్నది. ఈ సినిమా విషయంలో మా అంచనాలన్నీ నిజమయ్యాయి' అన్నారు. తన తొలి చిత్రానికే ఈ స్థాయి స్పందన రావడం ఆనందంగా ఉందని దర్శకుడు కల్యాణ్ శంకర్ అన్నారు. సినిమా బాగా ఆడుతుందని ముందే ఊహించామని, ఆసాంతం చక్కటి వినోదంతో అన్ని వర్గాలను ఆకట్టుకుంటున్నదని హీరోలు నార్నే నితిన్, సంతోష్ శోభన్, రామ్ నితిన్ ఆనందం వ్యక్తం చేశారు.





